క్లుప్తంగా

స్పందనకు రండి.. సమస్యలు పరిష్కరించుకోండి

నందిగామ: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని సమస్యలు పరిష్కరించుకోవాలని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పేర్కొన్నారు.
కంచికచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన జరుగుతుందని తహసీల్దార్ శంకరబాబు ఆదివారం తెలిపారు.

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం



నందిగామ: పట్టణంలోని చెరువుబజార్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయ 22వ వార్షిక మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయంలోని బాబాకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం లక్షమల్లెలార్చన జరిగింది. లోక శాంతిని కాంక్షిస్తూ పలు హోమాలు చేశారు. సాయంత్రం సమయంలో సహస్ర దీపోత్సవం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ఆలయానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ ఆలయానికి ఆదివారం హైదరాబాద్, మియాపూర్ ప్రాంతానికి చెందిన డి.లక్ష్మీనారాయణరెడ్డి, జానకి దంపతులు రూ.15 వేలను ఆలయ ఈఓ కె రమేష్‌నాయుడు చేతుల మీదుగా అందజేశారు. విరాళం నగదును అంకమ్మవారి ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి వినియోగించాలని కోరారు. నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన కందుల జయశంకరరెడ్డి, లక్ష్మీత్రివేణి దంపతులు రూ.10,116 విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మర్రిబోయిన వెంకటరమణ, ధర్మకర్త కోలా రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని గాయత్రి కల్యాణ మండపంలో ఆదివారం గాయత్రీ సేవా సంఘం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 25 మందికి బీపీ, షుగర్, కంటి పరీక్షలు, మహిళలకు అన్ని రకాల వ్యాధులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో వైద్యులు భారవి, పిల్లలమర్రి సుబ్బారావు, శ్రీలక్ష్మి, సీపీఎం ర్టీ పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఉదయభానుకు ఆత్మీయ సత్కారం



జగ్గయ్యపేట అర్బన్: పులిచింతల ప్రాజెక్టు కంట్రోల్ రూమ్ ఆపరేటర్స్ పలువురు ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మొత్తం 24 మంది సిబ్బందిని ఆపరేటర్స్‌గా ఎమ్మెల్యే ఉదయభాను కృషితో రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌లో చేర్చింది. ఈ సందర్భంగా ఉదయభానును సత్కరించారు.

అవగాహన ర్యాలీ



జగ్గయ్యపేట అర్బన్: అంతర్జాతీయ రుతుస్రావ పరిశుభ్రతపై పట్టణంలో ఆదివారం జగ్గయ్యపేట పట్టణ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కౌమార బాలికలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. పరిసరాలతోపాటు ఇంటిని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ సౌమ్య, మెప్మా సిబ్బంది, ఆశా వర్కర్లు, ఆర్పీలు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.





● తిరుపతమ్మ సన్నిధిలో భక్తజన సందడి

గ్రామంలోని తిరుపతమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కావడం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జామునుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లాతోపాటు తెలంగాణ నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేలాది వాహనాలు తరలి రావటంతో పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రం పెద్ద నగరాన్ని తలపించింది. పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టారు. కొందరు భక్తులు మునేరు అవతల మామిడి తోటల్లో సందడి చేస్తూ వంటలు వండుకుని భోజనాలు చేశారు.

–పెనుగంచిప్రోలు

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి

'గడప గడప'లో నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



17వ వార్డులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యమని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని17వ వార్డులో ఆదివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ప్రతి గడపనకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ టీడీపీ హయాంలో గడిచిన 30 ఏళ్లలో జరగని అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నాలుగేళ్లలో చేసి చూపుతున్నామన్నారు.

రోడ్లకు మహర్దశ

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ పట్టణం కొత్త రూపు సంతరించుకుంటుందని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. గడిచిన నాలుగేళ్లుగా పట్టణంలోని అన్ని రహదారులకు మహర్దశ పట్టిందని కొనియాడారు. సీఎం రోడ్డును విస్తరించి అభివృద్ధి చేయడంతో పాటు ఎన్టీఆర్ రోడ్డుగా నామకరణం చేశామని గుర్తు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రజా ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యుడు బాపట్ల సాంబయ్య, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, నాయకులు పట్టా శ్రీను, బండారు వెంకట్రావ్, మేచర్ల విజయమ్మ, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసాదాల నాణ్యతకు ప్రాధాన్యం

తిరుపతమ్మ ఆలయ ఈఓ రమేష్‌నాయుడు



ప్రసాదాల తయారీ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న ఈఓ రమేష్‌నాయుడు

పెనుగంచిప్రోలు: ప్రసాదాల నాణ్యతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని తిరుపతమ్మ ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు అన్నారు. ఆలయంలో ప్రసాదాల తయారీ కేంద్రాన్ని, భక్తులు కొబ్బరికాయలు కొట్టే స్థలాన్ని ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలను రుచి చూశారు. ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. లడ్డూ ప్రసాదాలు కవర్లలో వేసి భక్తులకు ఇచ్చే సమయానికి డ్రై అవుతున్నాయని, అలా కాకుండా ప్రసాదాలు తయారీ కాగానే ట్రేలల్లో ప్రసాదాల కౌంటర్లకు పంపడానికి చర్యలు తీసుకుందామన్నారు. నాణ్యత విషయంలో తేడా ఉండకూడదన్నారు. కొబ్బరికాయలు కొట్టే స్థలంలో భక్తులను ఇబ్బంది పెట్టకూడదన్నారు. సిబ్బంది అందరూ విధులపై నిర్లక్ష్యంగా ఉండకూడదని సూచించారు. భక్తులతో మర్యాదగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు ఆదిమూలం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపం



నందిగామలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్మానుష్యంగా జాతీయ రహదారి



కంచికచర్లలో నేషనల్ హైవేపై తక్కువగా కనిపిస్తున్న జన సంచారం

నందిగామ/కంచికచర్ల: రోహిణి కార్తెలో భానుడు కొద్ది రోజులుగా తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఆదివారం నందిగామలో పగటి ఉష్ణోగ్రతలు 42.6 నమోదు కాగా రాత్రి ఉష్ణోగ్రతలు సైతం 28.4 డిగ్రీలు నమోదయ్యాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ఉదయం 7 గంటల నుంచే వడగాల్పులు ప్రారంభమయ్యాయి. అత్యవసరమైన పనులు ఉన్నవారు తప్పితే ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో పెద్దగా కనిపించలేదు. నందిగామ, కంచికచర్లలో రోడ్లపై జనసంచారం తక్కువగా కనిపించింది.

జీవనశైలిలో మార్పులతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ అశోక్ వాష్నికర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మంచి ఆహారం, జీవనశైలితోనే ఆరోగ్యంగా ఉంటామని ఆరోగ్య భారతి అఖిల భారత అధ్యక్షుడు డాక్టర్ అశోక్ వాష్నికర్ అన్నారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయం హైందవిలో ఆదివారం ఆరోగ్య భారతి క్షేత్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య వ్యక్తి, తద్వారా ఆరోగ్య గ్రామం తద్వారా ఆరోగ్య దేశం అనే సదాలోచనతో ఆరోగ్య భారతి పనిచేస్తోందన్నారు. మన ఇంటిలో ఉండే నిత్యావసర వస్తువులు, కూరగాయలతో మనం ఆరోగ్యంగా ఉండే విధానాన్ని వివరించారు. ఆరోగ్య భారతి అన్ని రాష్ట్రాల్లోనూ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులకు మహిళలకు ఆరోగ్యం, హెల్తీ లైఫ్ స్టైల్ కొరకు కార్యక్రమాలు నిర్వహిస్తుందని ప్రాథమిక చికిత్స, చైర్ యోగ, స్వస్థ గ్రామం వంటి 24 రకాలైన కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ప్రముఖ యూరాలజిస్టు, పిన్నమనేని ఫౌండేషన్ అవార్డు గ్రహీత డాక్టర్ సురేష్ పాతంకర్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఆరోగ్య భారతి ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయాలని చెప్పారు. కార్యక్రమంలో విజయవాడ ఆరోగ్య భారతి అధ్యక్షురాలు డాక్టర్ సౌజన్య, ఆశ్రమం కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్ రావు, ఆరోగ్య భారతి అఖిల భారత కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతానికి చెందిన వైద్యులు, ఆరోగ్య భారతి కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమాలను ప్రాంత కార్యవర్గ సభ్యులు శంకర్ నారాయణ, డాక్టర్ నారాయణ పర్యవేక్షించారు.

అంకమ్మతలి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి కుంకుమ, శ్రీచక్రార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

ఇబ్రహీంపట్నం: స్థానిక పంప్ హౌస్ నుంచి మెయిన్ స్టోరేజ్ ట్యాంక్‌కు వెళ్లే ప్రధాన పైప్‌లైన్ శనివారం మరమ్మతులకు గురైంది. కొండపల్లి, ఇబ్రహీంపట్నంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. తక్షణమే స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు యుద్ధప్రాతిపదికన నాలుగు అడుగుల లోతులో ఉన్న పైపులను జేసీబీతో తవ్వి వాటి స్థానంలో నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి వరకు జరిగిన పైప్‌లైన్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పర్యవేక్షించారు.

ఖురాన్ బోధనలు అనుసరణీయం



నందిగామ టౌన్: పవిత్ర ఖురాన్ గ్రంథ బోధనలు నేటి సమాజానికి అనుసరణీయమైనవని ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని పెద్ద మసీదు ఎదురుగా అరబ్బీ మదర్సా ఆవరణలో శనివారం రాత్రి జల్సాయే దస్తార్ బందీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మదర్సా మదీనతుల్ ఉలూమ్ ఖ్వాజా గరీబ్ నవాజ్‌లో హాఫీజ్ శిక్షణ పొందిన ముస్లిం విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. తొలుత ముస్లింలతో కలిసి ప్రత్యేక నమాజ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యేను ముస్లిం మత పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, జామా మసీదు ముతవల్లి ఖాజా మొహిద్దీన్, హజరత్ సయ్యద్ కలీముల్లా షా హుసైనీ, హజరత్ అల్తాఫ్ ఖాన్ రజ్వీ తదితరులు పాల్గొన్నార

ఎన్టీఆర్‌కు నివాళి



నందిగామ టౌన్: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తన నటనతో తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు.
ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పట్టణంలోని సీఎం రోడ్డులో ఎన్టీ రామారావు విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఎన్టీ రామారావు విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయాలు చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం తండ్రి బాటలో నడుచుకుంటూ ప్రజలు మెచ్చే పాలన అందిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, చిరుమామిళ్ల చైతన్యకుమార్, రాయల జానకిరామయ్య, కోమటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

జైనులకు అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో జైనులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ జైన్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి అన్నారు. చైర్మన్‌గా నియమితులైన మనోజ్‌కొఠారికి శ్రీ సంభవనాథ్ రాజేంద్ర సూరి జైన్ సూర్జీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని పూల బావివీధిలో ఉన్న రాజేంద్ర భవన్‌లో సత్కార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్‌కొఠారి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని జైనులను గుర్తించిన వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. జైనుల సమస్యలను పరిష్కరించేందుకు తాను వారధిగా పని చేసి అండగా ఉంటానని తెలిపారు. రానున్న కాలంలో జైనులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. జైనులందరూ ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. పలువురు మత గురువులు ఆశీస్సులందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రముఖులు రాజు సోలంకి తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సర్వసభ్య సమావేశం

నందిగామ: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ మండల వరలక్ష్మి అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, 29 అంశాలపై చర్చించి ఆమోదిస్తారని వివరించారు.

పుస్తక పఠనం అలవరచుకోవాలి

పెనుగంచిప్రోలు: చిన్నతనం నుంచి పుస్తక పఠనం అలవరచుకోవాలని గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రంథాలయాల్లో విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించడం, మహానుభావుల జీవిత చరిత్రలు తెలియజేయటంతో పాటు పుస్తక పఠనంతో కలిగే లాభాలు వివరించారు.

సత్యసాయి మందిరంలో ఆధ్యాత్మిక శిక్షణ

నందిగామ: పట్టణంలో రైతుపేటలోని సత్యసాయి మందిరంలో ఆదివారం ఆధ్యాత్మిక శిక్షణ శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో జరిగిన సమావేశానికి పలువురు సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం సత్యసాయికి పూజలు చేశారు.

ఐరిస్‌తో బియ్యం పంపిణీ

ప్రభుత్వ విప్ ఉదయభాను



ఐరిస్ పరికరాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, ఆర్డీఓ రవీంద్రరావు

జగ్గయ్యపేట అర్బన్: లబ్ధిదారులకు మెరుగైన సేవలందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఆదివారం ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో పేట నియోజకవర్గ వ్యాప్తంగా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు అందజేస్తున్న 64 రేషన్ వాహనాల సిబ్బందికి ఆర్డీవో రవీంద్రరావుతో కలిసి ఎమ్మెల్యే ఉదయభాను ఐరిస్ పరికరాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం ఎండీయూ వాహనాలతో ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తున్నారని, కొందరికి వేలిముద్రలు సరిగా పడకపోవడంతో రేషన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి అధికారులు తీసుకురావడంతో ఐరిస్ పరికరాలను అందజేస్తున్నట్లు తెలిపారు. వేలిముద్రలు పడకపోతే ఐరిస్‌తోగానీ, ఆధార్ ధ్రువీకరణ ద్వారా సరుకులు ఇవ్వడానికి సులువుగా ఉంటుందన్నారు. తహసీల్దార్ నాగరాజు, వైకుంఠరావు, పీడీఎస్ డీటీ మానస తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి సహకరించాలి



విద్యార్థులకు ప్లాస్టిక్‌ను వాడొద్దని వివరిస్తున్న ఫారెస్ట్ రేంజర్ షహినాసా

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం 21వ రోజు వేసవి విజ్ఞాన శిబిరం జరిగిందని గ్రంథ పాలకుడు అల్లూరు రామచంద్రుడు పేర్కొన్నారు. ముఖ్యఅతిథి అటవీశాఖ నందిగామ డిప్యూటీ రేంజర్ ఎస్ షహినాసా పాల్గొని మాట్లాడుతూ, ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్లాస్టిక్ సంచుల వాడకంతో డ్రైనేజీల్లో మురుగునీరు పారకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే కాల్వల్లో నిలిచి దోమలు వ్యాపిస్తున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలన్నారు. అనంతరం డ్యాన్స్ మాస్టర్ నవీన్‌నాని విద్యార్థులకు డ్యాన్స్ నేర్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్ అంతర్జాతీయ ఆకలి దినోత్సవాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం డ్రాయింగ్ టీచర్ నీలం సర్వేశ్వరరావు, ఎం.కనకారావు విద్యార్థులకు చిత్రలేఖనం, క్రాఫ్ట్స్ నేర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వరరావు, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల పక్షపాతి జగన్‌మోహన్‌రెడ్డి

ప్రభుత్వ విప్ ఉదయభాను



హజ్ యాత్రకు వెళుతున్న ముస్లింలను సన్మానిస్తున్న ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: హజ్ యాత్రకు వెళ్లే వారిపై ఎక్కువ ఆర్థిక భారం పడకుండా ఒక్కొక్కరికి రూ 80 వేల ఆర్థిక సాయం అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరొకసారి ముస్లింల పక్షపాతి అని చాటుకున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఆదివారం స్థానిక జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రకు వెళ్లే 13 మంది ముస్లింలను ఉదయభాను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లాలంటే హైదరాబాద్, బెంగుళూరు వంటి నగరాల నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో అనేక దఫాలుగా చర్చలు జరిపి మొట్టమొదటి సారిగా మన రాష్ట్రం నుంచి ముస్లింలు హజ్ యాత్రకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి వెళ్లే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ 14.15 కోట్లు విడుదల చేసి మరొకసారి ముస్లింల పక్షపాతిగా నిరూపించుకున్నారని తెలిపారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, మంగొల్లు గ్రామ నాయకుడు అన్నెపాగ నరసింహారావు, జామియా మసీదు కమిటీ ప్రెసిడెంట్ జలీల్, కమిటీ సభ్యులు సయ్యద్‌ఆలీ,అల్లాబక్షు, రహంతుల్లా, హబీబ్, మీసార్, సుభాని, ఎస్ఎస్సీ సైదా పాల్గొన్నారు.
పట్టణంలోని నెహ్రూ చౌక్‌లో జామియా మసీదు కమిటీ ఆధ్వర్యాన ఉచితంగా నిర్వహిస్తున్న ఉర్దూ సమ్మర్ క్లాస్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఎమ్మెల్యే ఉదయభాను మెమొంటోలు అందజేశారు. మొత్తం 210 మంది ముస్లిం విద్యార్థులకు క్లాస్‌లు నిర్వహిస్తుండగా, వారిలో ప్రతిభ కనపరచిన రిహాన్, షాహిద్, సాజిదా, సన, రుక్షానాలకు ఉదయభాను మెమొంటోలు అందజేసి అభినందించారు.

ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న గౌతమ్‌రెడ్డి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజలు ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి చేయాలని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి సూచించారు. స్థానిక సత్యనారాయణపురం భగత్ సింగ్ రోడ్డులోని వైఎస్సార్ ట్రేడ్‌యూనియన్ కార్యాలయంలో ఆదివారం గరుడ కంటి, దంతవైద్యశాల ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైద్యశిబిరాన్ని ప్రారంభించారు.

300 మందికి వైద్య పరీక్షలు..

ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారని చెప్పారు. తాము ఇప్పటికే స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 5 వేల ఐఓఎల్ ఆపరేషన్స్ చేయించామన్నారు. ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని సూచించారు. గరుడ కంటి, దంత వైద్యశాల నిర్వాహకులు శ్రీహర్ష, ఇబ్రహీం మాట్లాడుతూ.. తమ వంతు బాధ్యతగా తాము ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం 300 మందికి కంటి వైద్యులు నారాయణ, శ్రీ దివ్య దంత వైద్యులు ప్రకాష్ ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కమ్మిలి రత్నకుమార్, బల్లం కిషోర్, ఎం.ప్రభు, పి.రాజేష్, శంకర్ రాజు, గోవింద్ పాల్గొన్నారు.

దాడి, బెదిరింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకునితో పాటు అతని తల్లిదండ్రులపై దాడి చేయడమే కాకుండా బెదిరింపులకు పాల్పడిన వారిపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రైజర్‌పేట చర్చి ప్రాంతానికి చెందిన సోముపాక శరత్‌చంద్ర వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. ఈ నెల 26వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో వైఎస్సార్ కాలనీ నుంచి తిరిగి వస్తున్న శరత్‌చంద్ర, అతని స్నేహితుడు కిరణ్‌లకు ఎర్రకట్ట రోడ్డులో కొలగాని అశోక్, దేవా మరి కొంత మంది ఎదురుపడ్డారు. కారణం లేకుండా ఇద్దరిపై దాడి చేశారు. ఈ విషయం తెలుసుకుని అక్కడకు వచ్చిన శరత్‌చంద్ర తల్లిదండ్రులపై కూడా దాడి చేశారు. 27వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో ఉన్న శరత్‌చంద్రపై అశోక్ మరో నలుగురు మరో మారు దాడి చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారు. ఘటనపై బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.